# పటేలు



## ఏప్రిల్ 27వ తేదీ.

రోజంతా ఎడాపెడా ఎండగాచిన వాతావరణంలో హఠాత్తుగా మార్పు.

ఆకాశమంతా మబ్బులు కమ్మేశాయి.

దూరాన ఏదో పిడుగు పడిన శబ్దం.

ఉలిక్కిపడి లేచాడు అనంతరెడ్డి.

గబగబా బయటికొచ్చి ఆకాశానికేసి చూశాడు. అతని గుండెలు లబలబలాడాయి.

“లక్ష్మీ ! డాబాపైన వడియాలు ఆరబెట్టినవేమో ! తీసెయ్ !” అంటూ టీ.వీ. చూస్తున్న భార్యను హెచ్చరించి, గొడుగందుకొని పొలంవైపు పరుగుతీశాడు.

అతని గుండెల్లో ఆలోచనల సునామీ.

'ఏం వానలో ఏమో ! సరిగ్గా పంట చేతికొచ్చే సమయానికి తయారు. రైతులకన్నీ పరీక్షలే ! ఎకరాకు యాభై బస్తాలు, అరవై బస్తాలు దిగుబడి వస్తుందని టీవీల్లో, రేడియోల్లో మోతలు. అందుకు తాన తందాన అన్నట్లు డీలర్ల కోతలు. ఆ మాటలు వింటున్నప్పుడు కళ్ళముందు కనకమాలక్ష్మి కనిపిస్తున్నట్లే అనిపిస్తుంది. కాని, నారు పెట్టి నీరు కట్టడంతోనే మొదలౌతుంది అసలు కష్టం.

'ఏ ప్రభుత్వ మొస్తేనేం రైతుల కష్టాలు నాయకులను గద్దెనెక్కించే నేపథ్య సంగీతంగానే పనికొస్తాయి. ముందోమాట, తర్వాతోమాట. ఎన్నికల తర్వాత మేమెప్పుడూ 'బోడి మల్లయ్య'లమే. సమయానికి కరెంటుండదు. కరెంటుంటే బిల్లు మోగిపోతుంది. ఒక్కోసారి ట్రాన్స్‌మీటరే పోతుంది. పెట్టుబడిలో ఏ మాత్రం వెనుకబడ్డా, దిగుబడి కంటి తుడుపే. ఆ వచ్చేదైనా ధర దగ్గరికొచ్చేసరికి చతికిలబడిపోతుంది.

'అమ్మబోతే అడివి – కొనబోతే కొరివి'. ఎప్పుడో ఒగప్పుడుగానీ మా కళ్ళల్లో ఆశలు నిలవవు. ఈసారి పంట బాగుందని సంబరపడి నాలుగు రోజులు కాలేదు. 'పులిమీద పుట్ర' తయారు. మేమెంత ఆరాటపడ్డా ఆ పైవాడి దయలేకపోతే అంతే ...

'వరికొయ్యమని వారం రోజులుగా పోరుతున్నాను – పాలికాపు పాపయ్యతో. 'ఇదిగో కోద్దాం –అదిగోకోద్దా' మంటూ నెట్టుకొస్తున్నాడు. ఈరోజు ఖచ్చితంగా కొయ్యాలని వార్నింగిచ్చాను. పది పదిహేనుమంది కూలీలొచ్చినా అధమం అయిదురోజులు పడుతుంది మూడెకరాలకు. వర్షం మామూలుగా వస్తే పని జరగదు. పంట కొంచెమైనా నష్టపోతుంది. ఇక వడగండ్లు పడితే ...' ఆ ఆలోచనే అనంతరెడ్డిని వణికించింది.

చల్లటిగాలి అతని వంటిని తాకింది–దూరాన వర్షం పడుతున్న సూచనగా. పైకి చూశాడు తమ పొలానికి వాయవ్యంగా దట్టమైన మబ్బులు. అప్పుడప్పుడూ ఉరుములూ – మెరుపులూ .... నడకలో మరింత వేగం పెంచాడు.

చినుకులు మొదలయ్యాయి. గాలి బలంతో వడిసెల్లో పెట్టి కొట్టినట్లు తాకుతున్నాయి– పెద్ద పెద్ద చినుకులు.

'వడగండ్లు కావు కదా !' భయం భయంగా చుట్టూ పరికించాడు రెడ్డి. అవి వడగండ్లు కావు. కాని వాటి తాకిడి అంతకు తక్కువేం లేదు. గుండెల్లోని బాధ కళ్ళలో నుండి

బయటకొచ్చేందుకు అవస్థపడుతూండగా పొలం అంచులోకి చేరుకున్నాడు.

వరి కోస్తున్నారు కూలీలు. ఎకరాలో సగం పైగా మాత్రం పూర్తయినట్లున్నది. 'గుత్త (కాంట్రాక్టు) కిచ్చాడో, రోజుకూలీ లెక్కన పనిచేయిస్తున్నాడో ? 'గుత్త' అయితే రోజుకు పుట్టెడు గింజలైనా ఇవ్వాలి. రోజు కూలీ అయితే అయిదు రోజుల పని పన్నెండు రోజులు చేస్తారు ..." అనుకుంటూ పాపన్నను కేకేశాడు.

గొంతు సరిగ్గా పెగల్లేదు. రెండోసరి బిగ్గరగా అరిచాడు.

ఆ శబ్దానికి ఇద్దరు ముగ్గురు పనివాళ్ళు లేచారు. అనంతరెడ్డి పటేలును చూడగానే మళ్ళీ గబుక్కున పనిలో మునిగిపోయారు.

అందులో నుండి ఒకావిడ పరుగు పరుగున పటేలు వద్దకి వచ్చి, పది గజాల దూరంలో చేతులు నులుముకుంటూ నిలబడింది. ఆమె పాపన్న భార్య రత్నమ్మ.

"పాపన్నేడి ?" సవాలక్ష సందేహాలు అనంతరెడ్డి గొంతులో.

"ఆయనకు జెరమొచ్చింది పటేలా. 'పటేలు తొందరవెడుతున్నడు ఈ రోజు కోతలు మొదలు వెట్టండి' అంటాని నన్ను బంపిచ్చిండు" చెప్పలేక చెప్పింది రత్నమ్మ.

అనంతరెడ్డి కోపం తారాస్థాయికి చేరింది. 'వీనికి తిండెక్కువైంది. అంతకంటె తాగుడెక్కువైంది. బాగా తాగి లేవలేక ఇంట్లో పడుకొని ఉంటాడు !' పళ్ళు పటపటమన్నాయి. 'అత్తమీది కోపం - దుత్తమీద' చూయించలేకపోయాడు. కోపం నిగ్రహించుకుంటూ రత్నమ్మను అడిగాడు -" ఇప్పుడెంత మందొచ్చిన్రు ? కూలికా ? గుత్తకా ?"

"కూలికెవ్వరొస్తున్నరు పటేలా ? గుత్తకే దొరుకుత లేరు. పన్నెండు మందొచ్చిన్రు" పరిస్థితి వివరించింది రత్నమ్మ.

గాలి ఉధ్రతి పెరిగింది. పైకొస్తాయనుకున్న మబ్బులు పలచబడి ఈశాన్యంగా కదలిపోయాయి.

గట్టిగా ఊపిరి పీల్చుకొని మనసులోనే దేవునికి కృతజ్ఞతలు తెలుపుకున్నాడు అనంతరెడ్డి. అయినా పాపన్న మీద అతని కోపం చల్లారలేదు.

'వారం రోజులనాడే ఈ పనిచేసి ఉంటే ఈనాడింత ఆందోళన ఉండేది కాదు. ఇప్పుడు

గండం గడిచింది సరే, ఎండాకాలం – చెడుగంత వాన ఏ క్షణాన ముంచుకొస్తుందో ఎవరికెరుక? అసలు అలగా జనాన్ని తలకెక్కించుకోవడమే తన బుద్ధితక్కువ. తన మెతకతనమే గదా వాళ్ళకింత అలుసిచ్చింది ! వానికేం ? పొలం మనది – పెట్టుబడి మనది – నష్టం మనది. 'పోతే – రెక్కల కష్టంపోయిందేమో'నని వాడు సరిపెట్టుకుంటాడు. అప్పులు తీర్చలేక అవస్థపడేది మనమేకదా ! ఈ సన్నాసులకు అసలు కృతజ్ఞతనేదే తెలువదు ... ఛీ !" కసికసిగా ఆలోచిస్తూ పాపన్న ఇల్లు చేరుకున్నాడు రెడ్డి.

తలుపు వారగా వేసి ఉంది.

సుడిగాలిలా లోనికి ప్రవేశించిన అనంతరెడ్డి పటేలు అక్కడి దృశ్యం చూసి ఆశ్చర్యపోయాడు.

నులక మంచం మీద శేషసాయిలా పడుకొని, టీవీ చూస్తున్నాడు పాపన్న. మంచం పక్కనే బాటిల్, కంచంలో అనుపానాలు.

అనంతరెడ్డికి కంపరమెత్తింది – "అరేయ్ !నీవసలు మనిషివేనా ?"

"పటేలా ...!" ఏదో అనబోయాడు పాపన్న.

"థూ ... ! నీకెంత జేసినా ఏట్లో పచ్చిపులుసు పిసికినట్లేరా ! గుమానంలేని ముం ...కొడుకులు. ఆడ చేను సంకనాకి పోతున్నది. ఈడ నీవు కాలుమీద కాలేసుకోని టైంపాస్ జేస్తున్నావ్ ? నీకేమన్న నొప్పి అయినాదిరా ? నేను అడ్డమైననోని దెగ్గెర అప్పులు జేసి పెట్టువడి వెడ్త. నీదేం వొయ్యింది ? నీవు దొరలాగా మజా ఉడాయిస్తున్నవు ..." ఊపిరి పీల్చుకునేందుకన్నట్టు ఆగాడు అనంతరెడ్డి.

"పటేలా ... కోపంగాకు ... ! నీ కాలుమొక్త ! అడుగు దీసి అడుగెయ్యనీకె రాదు. చేతులు గదలై, కాళ్ళు గదలై ..." సంజాయిషీగా ఏదో చెప్పబోయాడు పాపన్న.

"అయితయారా ! అన్ని నొప్పయితయి ... వగల నీకె దాగితె ఏది నొప్పిగాదు ? ఫెక్కిచ్చి ముడ్డిమీద ఒక్కటి తంతే అన్ని సక్కగయితయి. చేను నీకు పాలికిచ్చుడే నా బుద్ధితక్కువ. థూ ! నీ యవ్వ !" కాండ్రించి వాకిట్లో ఉమ్మేస్తూ అక్కడి నుండి వడివడిగా ఇంటికి నడిచాడు రెడ్డి.

గుమ్మంలోనే ఎదురు చూస్తోంది అతని అర్ధాంగ 'లక్ష్మి'.

అనంతరెడ్డి విసురుగా వెళ్ళి వాలుకుర్చీలో వాలిపోయాడు. అతని మనసు కుతకుతలాడి పోతూంది.

'ఈ రోజుకు వడగండ్ల బారి నుండి తప్పించుకున్నాం గానీ, కోత - నూర్పిడి పూర్తికావాలంటే ఇంకా కనీసం ఐదురోజులైనా పడుతుంది. ఈలోగా వానదేవుడూరుకుంటాడా? ఉన్నదాంట్లో సగం నేలపాలైతే కూలీలకేమివ్వాలి ? పెట్టుబడి సంగతేంది ?ఆ పాలివాడి పాలు..." పాపన్న గుర్తుకు రాగానే మరోసారి భగ్గుమంది మనసు. 'ఆ కొడుకుని కాల్చి పారేసెయ్యాలి !'

"చాయ్ తీసుకోండి !" లక్ష్మి టీ అందించింది.

ఆ సమయంలో అలవాటుగా తాగే చాయ్ అప్పుడు ఏ మాత్రం రుచించలేదు రెడ్డికి. ఏదో వేణ్ణీళ్ళు గొంతులో ఒంపుకుంటున్న అనుభూతి, ఒక్క గుక్క తాగి, పక్కన పెట్టేశాడు.

'ఆ పాపిగాడ్ని ఊరికే వదిలిపెట్టగూడదు. ఈరోజు నాకు నష్టం జరుగుతూన్నదంటే దానికి కారణం ముమ్మాటికీ వాడే. పెళ్ళిళ్ళని - పేరంటాలని, మనుషులు దొరకలేదని, ఆరోగ్యం బాగోలేదని అడ్డమైన వంకలుబెట్టి ఆలస్యంచేశాడు. పంటంతా చేతికి రాకుండా చేస్తున్నాడు ... ఏదో ఒక కేసు బనాయించి, పోలీసులతో కుళ్ళబొడిపించాలి ..."

"ఏవండీ ! ఓసారి కోటపల్లి వెళ్ళొద్దామండీ ...!" అనంతరెడ్డి ఆలోచనల్ని చెదరగొట్టింది లక్ష్మి. అతడు కోపంగా కనిపించినా, తప్పనిసరై అడిగింది.

భార్యను చురుగ్గా చూశాడు రెడ్డి.

"అర్ధమ్మరాతిరి లేసి 'పెద్దమ్మా' అన్నట్టు ఎప్పుడు పడితే అప్పుడు అమ్మగారింటికి పోదామంటవేందే ? వచ్చి వారంగాలేదు, అప్పుడే మనసు మళ్ళిందా ?" ఆ వ్యంగం మాటున కోపం ఉంది.

"అది కాదండీ ! మా తమ్ముడికి చికెన్‌గున్యా సోకిందట. నూటనాల్గు డిగ్రీల జ్వరమొచ్చిందట. ఇంతకు ముందే అమ్మ ఫోన్ చేసి చెప్పింది. "కారణం చెప్పింది లక్ష్మి. భర [illegible] ము'డని తెలిసి, సహనంతో వ్యవహారం నడుపబోయింది.

అనంతరెడ్డిలో మార్పు రాలేదు. అసలేదీ తలకెక్కించుకునే స్థితిలో లేదు అతను. ఇరవై అయిదేళ్ళ తమ్ముని పట్ల భార్య చూపిస్తున్న మమకారం నచ్చలేదు. అత్తగారింటి వాతావరణం కళ్ళముందు కదలాడింది.

"అఁ ! రోజుకు నాలుగు కోళ్ళు, వారానికి రెండు మేకలు దింటూ దున్నపోతులాగ ఒళ్లు పెంచుకొమ్మను నీ తమ్ముడ్ని, ఏ రోగమూ రాదు. వానికి నీసు లేందే నాలికాడదం మందు లేకుంటే గొంతు దిగదు. మరి చికెన్ గునియాలు, మటన్ మరియాలు రాక -జేస్తయ్ ?"

తమ్ముడినట్టా ఎద్దేవా చేయడం లక్ష్మికి మింగుడు పడలేదు. 'ఐనా మా వాళ్ళకంటే ఈయనకేం ఎక్కువని ? ఏదో మంచి కుటుంబమని మా నాయన ఈయన మొగాన తనని గొట్టాడు. తాను చదవుకున్నది. మంచి ఉద్యోగస్థుడ్ని పెళ్ళి చేసుకొని సిటీలో సెటిలై పోవచ్చనుకున్నది. హుఁ ! ఈ పల్లెటూరి బైతుతో మాటలు పడుతున్నది ...' అంతర్మథనం లోనూ బాహ్యస్పృహ వదల్లేదు ఆమె. తనను తాను నిగ్రహించుకుంటూ మళ్ళీ అడిగింది.

"ఇప్పుడు బయల్దేరి, రేపు ఉదయానికే వచ్చేద్దాం పదండి !" ఈసారి అభ్యర్థన స్థానంలో నిర్ణయం స్పష్టమైంది.

భార్య తనను ఆజ్ఞాపిస్తున్నట్లనిపించింది రెడ్డికి. అది భరించలేకపోయాడు. "నేను రాను. అంతగా ఐతే నువ్వే పో !" కట్టె విరిచాడు.

"నాకు తప్పదు గదా !" విసుగ్గా అని, విసురుగా కదిలింది.

✪ ✪ ✪

ఆ రాత్రి భోజనం సహించలేదు అనంతరెడ్డికి. అన్నీ ఎదురుదెబ్బలే, అంతటా అసంతృప్తే. శారీరకంగా, మానసికంగా బాగా అలసిపోయాడు. తలపోటుకు తోడు ఒళ్ళంతా నొప్పులు. అన్నం తినకపోవడంతో నిద్ర సరిగ్గా పట్టలేదు. పక్కమీద అటూ ఇటూ దొర్లుతూనే ఉన్నాడు.

ఎవరో తలుపులు బాదుతున్నట్టు లీలగా తెలుస్తూంది.

"పటేలా ...!పటేలమ్మా ...! అది పనిమనిషి గొంతు.

బలవంతంగా కళ్లు తెరిచాడు, తల పూర్తిగా దిమ్మెక్కినట్టుంది, పక్కమీది నుండి లేవబోయాడు, శరీరం సహకరించలేదు. ఒంటిమీగ ఏదో బరువైన వస్తువున్నట్టు, అసలు ఒంట్లో బలమేలేనట్లు అనిపిస్తూంది.

చేతులమీద బలంవేసి లేవాలని ప్రయత్నించాడు. అదీ బెడిసికొట్టింది. విపరీతమైన నొప్పి, ఎముకల్లో, కీళ్ళలో.

మోచేతుల మీద బరువేసి ఎలాగో లేచాడు. కాళ్ళు నేలమీద ఆనించబోతే పాదాల్లో నొప్పి.

అవతల పనిమనిషి అరుపులెక్కువయ్యాయి. ఆమె కంగారుపడి చుట్టుపక్కలవాళ్ళను కూడా పోగుచేసిట్లుంది.

ఎలాగో పంటి బిగువున బాధను సహిస్తూ కాళ్ళమీద బరువేయబోయాడు – మోకాళ్ళలో నొప్పి.

తలుపు వద్ద జనాలు బాగానే పోగైనట్టున్నారు. ఏవేవో చర్చలు జరుగుతున్నాయి.

ఒంట్లో శక్తినంతా కూడదీసుకొని, గోడలనాధారంగా చేసుకొని, అడుగులో అడుగేసుకుంటూ వెళ్ళి తలుపుతీశాడు. మరుక్షణం ఓపిక లేక కుప్పకూలిపోయాడు.

ఇరుగు పొరగు వాళ్ళు ఆటోలో అనంతరెడ్డిని వికారాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి చేర్చారు.

✪ ✪ ✪

పటేల్‌గిరీలు, నవాబ్‌గిరీలు, కరణీకాలూ ఏనాడో అంతరించిపోయినా, ఇంకా తెలంగాణాలో అక్కడక్కడా ఆ వాసనలు మిగిలే ఉన్నాయి. వాటి తాలూకు శేషలేశమే అనంతరెడ్డి 'పటేలు'.

నిజాం పరిపాలనా కాలంలో ఆ ఊళ్ళో పోలీసు పటేల్, మాలీ పటేల్‌లు అనంతరెడ్డి కుటుంబీకులే. కాలప్రవాహంలో అధికారాలు అంతరించిపోయినా, ఆస్తులు హరించుకు పోయినా అన్నిటికీ తట్టుకొని నిజమైన పటేలుగా ఇప్పటికీ చలామణి కావడం అనంతరెడ్డికే చెల్లింది. అందుకు కారణం అతని మంచితనమొక్కటే.

సంబంధం

భౌతికంగా సాధారణమైన ఒడ్డూ పొడువూ గలవాడే, ఆర్థికంగా మధ్యతరగతికి అసలైన ప్రతినిధే. కాని, అతను మాట మనిషి, మంచి మనిషి, బుర్రలో పుచ్చు ఆలోచనలు లేని మనిషి. దురలవాట్లకు లొంగని మనిషి, అందుకే అంత మర్యాద. అతని మాటకు చెల్లుబాటు. అది తెచ్చిన స్వాతికాహంకారం, కరుకు వాచికం, తెచ్చిపెట్టుకున్న దర్పం – సమాజం అతనికి సలాము చేసేలా చేసింది. పాతాకొత్తల మేలు కలయికతో అనంతరెడ్డి 'పటేలు'గా అందరి హృదయాల్లో చోటు సంపాదించుకున్నాడు.

✪ ✪ ✪

"అనంతరెడ్డి పటేలొచ్చిండంట !" పక్కింటి జంగయ్య సమాచారం అందించాడు పాపన్నకి – వారంరోజుల తర్వాత.

పాపన్న గుండెల్లో గుబులు. తెలీని భయం అతన్ని పూర్తిగా నిస్సత్తువలోకి నెట్టేయసాగింది.

భార్య మొహం చూశాడు పాపన్న.

ఆమె పరిస్థితీ అందుకు భిన్నంగా లేదు.

పాపన్నకు జబ్బు చేయడంతో వరికోత ఆలస్యమైంది. మొదటిరోజు వర్షం బారి నుండి బయటపడ్డా రెండోరోజు మధ్యాహ్నం వడగండ్లు ఆటాడుకున్నాయి. సుమారు ఇరవై బస్తాల ధాన్యం నేలపాలయ్యింది. మళ్ళీ ఎండ బాగా కాయడంతో పనులు పూర్తయినా వంద బస్తాలపైనే దిగుతుందనుకున్న వరి ఎనభైకి పడిపోయింది. అందులో ముప్పై ఆరు బస్తాలు కూలీలకే. మిగిలిన నాలుగు లాగోళ్ళకే (పెట్టుబడులకే) చాలేట్టు లేవు. సకాలంలో కోయగలిగితే తలా పది బస్తలైనా మిగిలేవి. గత సంవత్సరం వర్షాలు లేక పంటలు సరిగ్గా పండలేదు. ఈసారి వర్షాలకు తగ్గట్టు కష్టపడి పనిచేస్తే – తీరా పంట చేతికొచ్చే సమయానికి సైంధవుడిలా చికెన్‌గున్యా అడ్డుపడింది. మరోపక్క వానదేవుడు కక్ష కట్టాడు. తనకు తిండికి మిగలలేదు, యజమానికీ గిట్టుబాటు లేదు. అన్నిటికీ మించి పటేలు నమ్మకాన్ని నాశనం చేశాడు తను. అన్ని రకాలుగా కష్టాల్లో ఆదుకున్నదేవుడు లాంటి మనిషి, ఛ ! పాడు బతుకు ! ఎవ్వనికీ పనికిరాని ఈ బతుకుకంటే చావే మేలు, అనుకున్నదే తడవుగా ఏదో నిర్ణయానికొచ్చినట్లు మెల్లగా లేచాడు పాపన్న.

"పాపన్నా ! ఒరే పాపన్నా !"

పాపన్న గుండె ఆగినంత పనయ్యింది. ఆ గొంతు పటేలుదే. తేరుకునే లోపే గుమ్మంలో ప్రత్యక్షమయ్యాడు అనంతరెడ్డి పటేలు.

మెకాన్ని చూసిన మేకలా చేష్టలుడిగి నిలబడ్డాడు నట్టింట్లో పాపన్న.

"పాపన్నా ! పాణమెట్లున్నదిరా ?"

మరోమారు షాక్‌కి గురయ్యాడు పాపన్న. పులి గడ్డిమేయడం చూసినా ఆశ్చర్యపోయేవాడు కాదేమో. అసలు ఆ పటేలు తమ పటేలేనా? అన్న అనుమానం అగ్గి రాముడిలా ఎగిరిపడే కరుగుదనం, చురుకుదనం, తేజస్సు ఈ పటేలులో లేవు మరి.

"ప..... టే.... లా.... " కష్టంమీద గొంతు పెగల్చుకున్నాడు.

"మందులు వాడుతున్నావా?" అదే మార్దవం రెడ్డి గొంతులో, "ఒగసారి బయటికి రా!" గుమ్మంలో నిలుచొనే బయటికి పిలిచాడు.

అంతా కలలా ఉంది పాపన్నకు.

"పటేలా... వనగండ్లు వడి...." జరిగిందంతా చెప్పబోయాడు సంజాయిషీ ఇస్తున్నట్టు.

"అరేయ్! గవన్నీ నేనిప్పుడడిగిన్నా?" గఁయ్ మన్నాడు అనంతరెడ్డి - తన సహజ ధోరణిలో.

అనుమానం లేదు. ఈయన మా పటేలే! అనిపించింది పాపన్నకు. పటేలు తిడుతుంటే సహజంగానే, హాయిగా ఉంటుంది తనకి. తిట్టాలి. బాగా తిట్టాలి. పంట నాశనం అయ్యేందుకు కారణమైన తనను ఇష్టమొచ్చిన తిట్లన్నీ తిట్టి, కోపం పట్టలేక ఓ దెబ్బ కూడా వెయ్యాలి. అప్పుడు హాయి మంటుంది....

"లాగోడి - ఆందాన్ని (ఆదాయం) లెక్కలుంటే తర్వాత జూసుకుందంగానీ. ముందు నీవు మంచి వైద్యం జేపిచ్చుకో. ఆ రోజు నీవు మంచం మీద లేవలేకుండ పడి వుంటే ఆయిల్ ఫయిల్ దిట్టిన...." అనంతరెడ్డి కళ్లు వాలిపోయాయి.

పాపన్న కళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి. పటేలును చూసి కంగారు పడిపోయాడు.

ఇద్దరి కళ్ళల్లో నీళ్ళు.

'ఇగో! ఈ వెయ్యి రూపాలు దీసుకో. ఎంటనే వికారాబాద్‌ల అనంతగిరి చౌరస్త దగ్గర మంచి డాక్టరున్నడు చూపిచ్చుకో." జేబులోని వెయ్యిరూపాయలు పాపన్న చేతికిచ్చాడు రెడ్డి.

పాపన్నకు నోటిమాట కరువయ్యింది. అన్ని భావాలూ కన్నీళ్ళే ప్రదర్శిస్తున్నాయి.

"పటేలా .... " కాళ్ళమీద పడబోయాడు.

అడ్డుకుంటూ లేవనెత్తాడు రెడ్డి.

"పాపన్నా! జరిగిందానికి బాధపడకు! పంట దేమున్నదిరా? ఒగసారొస్తది, ఒగసారి పోతది. ఇది మనకు కొత్తనా? భూమి తల్లికి సేవజేసేటోళ్లం మనం అమ్మకు కోపమొస్తే చెంపమీద గొట్టదా? నాయినకు కోమొస్తే ఊకుంటడా? కింద తల్లి. పైన తండ్రి! మనకెందుకురా బాధ?" కళ్లు తుడుచుకున్నాడు. ఆ మార్దవం స్థానంలో మళ్ళీ కరుకుదనమొచ్చేసింది -

"ఈ పైసలు నీకు అప్పుగా ఇస్తున్నాననుకోకు. నా తమ్మునికి కష్టమొస్తే నేనూకుంటానా? ఎంటనే వికారాబాద్‌కు పొయి మందులు దెచ్చుకో!" తనదైన శైలిలో హెచ్చరించి, అక్కడి నుంచి బయలుదేరాడు అనంతరెడ్డి పటేలు.

"మా పటేలు మారేజే!' గర్వంగా అనుకుంటూ ఆరాధనగా చూస్తుండిపోయాడు పాపన్న.

❀❀❀

(జాగృతి, 14, ఆగష్టు 2006)